నిస్వార్థ చాంపియన్

జట్టు కోసం దేనికైనా సిద్ధం | విజయాల్లో కీలకపాత్ర

'స్పేర్ టైర్‌ను కూడా ఇంత దారుణంగా వాడి ఉండరు! మీరు అతడిని ఓపెనర్‌గా పంపుతారు. ఐదు, ఆరు స్థానాల్లో ఆడిస్తారు. వికెట్ కీపింగూ చేయిస్తారు. జట్టు కూర్పులో ఎక్కడ సంక్లిష్టత ఉంటుందో అక్కడ అతడిని పంపిస్తారు.కానీ దేనికైనా అతడు అంగీకరిస్తాడు. జట్టు బాగు కోసం దేనికీ అడ్డు చెప్పడు. నిస్వార్థమైన ఆటతీరుకు ఇది నిదర్శనం!' కేఎల్ రాహుల్ గురించి నవ్‌జ్యోత్ సింగ్ సిద్ధూ చెప్పిన మాటలు ఇవి. సిద్ధూ చెప్పింది అక్షరాలా సత్యం. భారత జట్టులో రాహుల్ నిస్వార్థ సేవకుడు.

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

ఓపెనింగ్‌కు వెళ్తావా? **సరే వెళ్తా!** మూడో స్థానంలో బ్యాటర్ల కొరత ఉంది. అక్కడ బ్యాటింగ్ చేస్తావా? **మీ ఆజ్ఞ!** స్పిన్నర్లను కాచుకుని వికెట్లను కాపాడుకుంటూనే పరుగులు రాబట్టే మిడిలార్డర్‌లో ఆడతావా? **చిత్తం!**

లోయరార్డర్‌లో స్పెషలిస్టు బ్యాటర్ అవసరముంది. ఏడో స్థానంలో బ్యాటింగ్ చేస్తావా?

జట్టు కోసం దేనికైనా సిద్ధం!

వికెట్ కీపింగ్ చేస్తావా? **తప్పకుండా!..** ఇదీ టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ పరిస్థితి. అవును! అతడు టీమ్ మ్యాన్. జట్టు అవసరాల కోసం ఏ స్థానంలో బ్యాటింగ్‌కు రమ్మన్నా, వికెట్ల వెనుక ఉండాలని ఆదేశించినా దేనికైనా సిద్ధమనే రాహుల్ గత రెండేండ్లుగా భారత్ ఆడే భారీ టోర్నీ విజయాలలో కనిపించని హీరో. ముఖ్యంగా 2023 వన్డే ప్రపంచకప్, ఇటీవలే ముగిసిన చాంపియన్స్ ట్రోఫీ లోనూ జట్టు కోసం అతడు చేసిన సేవలు వెలకట్టలేనివి.

చారు. మళ్లీ 2019 నుంచి 2022 దాకా ఒకటి, రెండు స్థానాల్లో బ్యాటింగ్‌కు వచ్చిన రాహుల్‌ను 2023 వన్డే ప్రపంచకప్‌నకు కొద్దిరోజుల ముందు ఐదో స్థానానికి మార్చారు. ఐదో స్థానంలో అతడికి అద్భుతమైన రికార్డు ఉంది. 2019, 2023 వన్డే ప్రపంచకప్‌లో ఫిఫ్త్ పొజిషన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన రాహుల్.. 19 ఇన్నింగ్స్‌లలో ఏకంగా 58.07 సగటుతో 813 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా అతడు 2017-2025 దాకా 31 ఇన్నింగ్స్‌లలో 56.47 సగటుతో 1,299 పరుగులు సాధించాడు.

మళ్లీ ఆరో స్థానానికి..

ఐదో స్థానంలో ఘనమైన రికార్డు కలిగిన రాహుల్‌పై భారత్ మరో ప్రయోగం చేసింది. స్వదేశంలో ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ముందు అక్షర్ పటేల్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపి రాహుల్‌ను ఆరో స్థానంలో ఆడించింది. వాస్తవానికి 2024లో శ్రీలంకతో వన్డే సిరీస్‌లోనే కోచ్ గంభీర్ ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టినా ఆ తర్వాత టీమ్‌ఇండియా పెద్దగా వన్డేలు ఆడకపోవడంతో ఇది అంతగా చర్చలోకి రాలేదు. ఇక ఇంగ్లండ్ సిరీస్‌లో అక్షర్ మెరవడంతో భారత్.. చాంపియన్స్ ట్రోఫీ లోనూ అతడినే ఐదో స్థానంలో కొనసాగించింది. దీంతో రాహుల్.. కిందికి జరగక తప్పలేదు. కానీ ఏ స్థానంలో బరిలోకి దిగినా 'ఎక్కడ ఆడామన్నది కాదన్నయ్యా. మ్యాచ్‌ను గెలిపించామా లేదా అన్నదే ముఖ్యం' అన్నట్టుగా చెలరేగిపోతున్నాడు.

తెరచాటు చాంపియన్

చాంపియన్స్ ట్రోఫీలో స్పిన్నర్లు మాయ చేసి ఉండొచ్చు. కోహ్లీ పాకిస్థాన్, ఆస్ట్రేలియాపై మేటి ఇన్నింగ్స్‌లు ఆడి ఉండొచ్చు. ఫైనల్‌లో రోహిత్ ఆదుకుని ఉండొచ్చు. మిడిలార్డర్‌లో శ్రేయాస్ మెరుపులు మెరిపించి ఉండొచ్చు. కానీ టోర్నీ ఆసాంతం ఆఖర్లో ఒత్తిడినంతా తాను తీసుకుని మ్యాచ్‌లను ముగించిన బాధ్యత మాత్రం రాహుల్‌దే. ఈ టోర్నీలో నాలుగు ఇన్నింగ్స్‌లలో బ్యాటింగ్‌కు వచ్చిన రాహుల్ బంగ్లాదేశ్ తో 41 నాటౌట్, న్యూజిలాండ్‌తో 23, సెమీస్‌లో ఆస్ట్రేలియాతో 42 నాటౌట్, ఫైనల్‌లో 34 నాటౌట్‌తో ఫినిషర్ అవతారమెత్తాడు. ముఖ్యంగా బంతి గింగిరాలు తిరిగిన దుబాయ్ పిచ్‌పై తనదైన ఆటతో వికెట్‌ను కాపాడుకుంటూ జట్టును విజయతీరాలకు చేర్చిన తీరు గురించి ఎంత చెప్పినా తక్కువే. రాహుల్ చేసిన 30-40 పరుగుల విలువ కచ్చితంగా సెంచరీలకు మించినదే. అన్నింటికీ మించి అతడు ఆడిన ఇన్నింగ్స్‌లన్నీ ఛేదనలోనే కావడం మరో విశేషం. **2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో పోరులో రాహుల్ (107 బంతుల్లో 66) ఆటతీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. కానీ రాహుల్ ఆ విమర్శలను సవాల్‌గా తీసుకుని తన ఆటతీరులో మార్పులు చేసుకున్నాడు. చాంపియన్స్ ట్రోఫీలో అది స్పష్టంగా కనిపించింది. ఒత్తిడిలోనూ భారీ షాట్లు ఆడి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టడంలో రాహుల్ సఫలీకృతుడయ్యాడు.**

>
> జట్టు కోసం రాహుల్ చాలా కాలంగా ఎన్నో సవాళ్లను స్వీకరిస్తున్నాడు. అతడు ఎంతో ఒత్తిడిని తట్టుకుని మరి వాటికి ఎదురొడ్డి నిలబడ్డ తీరును చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉంది. చాంపియన్స్ ట్రోఫీలో రాహుల్ చేసిన 30-40 పరుగులే మాకు లోయరార్డర్‌లో చాలా కీలకమయ్యాయి. ముఖ్యంగా ఛేదనలో ఒత్తిడిని చిత్తు చేస్తూ ప్రశాంతంగా అతడు ఆడిన ఆటతో మేం మ్యాచ్‌లను విజయవంతంగా ముగించగలిగాం . – **రోహిత్ శర్మ**

సారీ.. నాకు సారథ్యం వద్దు!

ఢిల్లీ: కేఎల్ రాహుల్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ క్రేజీ ఆఫర్ ఇచ్చినా అతడు దానిని తిరస్కరించినట్టు సమాచారం. రాబోయే సీజన్‌లో ఢిల్లీకి సారథిగా నడిపించాలని యాజమాన్యం కోరినా అందుకు అతడు తిరస్కరించాడని ఫ్రాంచైజీ వర్గాలు తెలిపాయి. కెప్టెన్‌గా కంటే ఆటగాడిగా తాను జట్టుకు సేవలందిస్తానని రాహుల్ చెప్పినట్టు వినికిడి. గతంలో అతడు పంజాబ్, లక్నో జట్లకు సారథిగా వ్యవహరించాడు. రాహుల్ సారథ్య బాధ్యతలను వదులుకున్న(?) నేపథ్యంలో అక్షర్ పటేల్‌ను ఢిల్లీ కెప్టెన్‌గా ప్రకటించే అవకాశాలున్నాయి.

ముంబైకి తప్పని ఎలిమినేటర్

ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరు చేతిలో ఓటమి

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 3వ సీజన్‌లో టేబుల్ టాపర్‌గా నిలిచి నేరుగా ఫైనల్ ఆడాలన్న ముంబై ఇండియన్స్ ఆశలపై డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) నీళ్లు చల్లింది. ముంబైలోని బ్రబౌర్న్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టును 11 పరుగులతో ఓడించిన బెంగళూరు ఈ టోర్నీని గెలుపుతో ముగించింది. మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరుకు కెప్టెన్ స్మృతి మంధాన (37 బంతుల్లో 53, 6 ఫోర్లు, 3 సిక్సర్లు), ఎలీస్ పెర్రీ (38 బంతుల్లో 49 నాటౌట్, 5 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడటంతో నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 199 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో ముంబై.. 20 ఓవర్లలో 188/9 వద్దే ఆగిపోయింది. సీవర్ బ్రంట్ (35 బంతుల్లో 69, 9 ఫోర్లు, 2 సిక్సర్లు) పోరాడింది. ఈ ఓటమితో ముంబై.. ఈనెల 13న గుజరాత్ జెయింట్స్‌తో ఎలిమినేటర్ ఆడనుంది. ఆ మ్యాచ్‌లో గెలిచిన విజేతతో ఈనెల 15న ఢిల్లీ క్యాపిటల్స్ టైటిల్ పోరులో తలపడనుంది.

సేన్ ముందుకు.. ప్రణయ్ ఇంటికి..

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో తొలి రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. పురుషుల సింగిల్స్‌లో బరిలోకి దిగిన హెచ్‌ఎస్ ప్రణయ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా లక్ష్యసేన్ రెండో రౌండ్‌కు అర్హత సాధించాడు. ప్రపంచ 15వ ర్యాంకర్ అయిన లక్ష్యసేన్.. 13-21, 21-17, 21-15తో సు లియాంగ్ (చైనీస్ తైపీ)ను మట్టికరిపించాడు. రెండో రౌండ్‌లో లక్ష్యసేన్.. ఇండోనేషియా మూడో సీడ్ ఆటగాడు జొనాథన్ క్రిస్టీతో తలపడాల్సి ఉంది. ఇక ప్రణయ్.. 19-21, 16-21తో పోపోవ్ (ఫ్రాన్స్) చేతిలో పరాభవం పాలయ్యాడు. 53 నిమిషాల్లోనే ముగిసిన పోరులో ప్రణయ్ తొలి గేమ్‌లో పోరాడినా రెండో గేమ్‌లో తేలిపోయాడు. మహిళల సింగిల్స్‌లో యువ షట్లర్ మాళవిక బన్సోద్.. 21-13, 10-21, 21-17తో యో జియో మిన్ (సింగపూర్)ను ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సతీశ్ కుమార్-ఆద్య వరియత్ జంట కూడా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది.

రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం ఎత్తివేత

ఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)పై గత కొన్నినెలలుగా నిరాటంకంగా కొనసాగుతున్న నిషేధాన్ని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఎత్తేసింది. 2023, డిసెంబర్ 24న డబ్ల్యూఎఫ్ఐపై సస్పెన్షన్ వేటు వేసిన కేంద్రం.. మంగళవారం దానిని తొలగించింది. ఇన్నాళ్లూ డబ్ల్యూఎఫ్ఐ కార్యకలాపాలను అడ్‌హక్ కమిటీ పర్యవేక్షించింది. దేశంలో రెజ్లింగ్ పోటీల నిర్వహణ, అంతర్జాతీయ టోర్నమెంట్లకు జట్ల ఎంపిక నిమిత్తం కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలో ఆసియన్ చాంపియన్‌షిప్స్ జరగాల్సి ఉన్న నేపథ్యంలో తాజా నిర్ణయం రెజ్లర్లకు ఊరటనిచ్చింది. లైంగిక వేధింపుల ఆరోపణలతో పదవీచ్యుతుడైన మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్ స్థానంలో సమాఖ్యకు ఎన్నిక నిర్వహించగా ఆ స్థానాన్ని అతడి అనుచరుడైన సంజయ్ సింగ్ గెలవడం.. గెలిచిన వెంటనే పాలకవర్గం అత్యుత్సాహం ప్రదర్శించిన నేపథ్యంలో కేంద్రం డబ్ల్యూఎఫ్ఐపై నిషేధం విధించిన విషయం విదితమే.

150వ వార్షిక టెస్టు మరింత ప్రత్యేకంగా..

మెల్‌బోర్న్: అగ్రశ్రేణి జట్లు అయిన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య 2027 మార్చిలో జరుగబోయే 150వ వార్షికోత్సవ టెస్టుకు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) మరింత సొబగులు అద్దుతోంది. ఇరు జట్లకు ప్రత్యేకమైన ఈ టెస్టును మరింత ప్రత్యేకంగా మార్చేందుకుగాను ఈ మ్యాచ్‌ను ఫ్లడ్‌లైట్ల వెలుతురులో (పింక్ బాల్ టెస్టు) ఆడించనున్నారు. ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో కూడా పురుషుల క్రికెట్‌లో ఇదే తొలి డే అండ్ నైట్ టెస్టు కావడం విశేషం. ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలు 1877లో తొలి టెస్టు ఆడగా 1977లో వందేండ్ల సంబురాన్ని ఘనంగా నిర్వహించుకుంది.

ప్రిక్వార్టర్స్‌కు యుకీ బాంబ్రీ

కాలిఫోర్నియా: ఇండియానా వెల్స్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో భారత ఆటగాడు యుకీ బాంబ్రీ, తన సహచర ఆండ్రే గొరన్సన్ (స్వీడన్)తో కలిసి ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో ఈ భారత, స్వీడన్ ద్వయం.. 3-6, 7-6 (7/5), 10-8తో జిలెన్స్‌కి (పోలండ్), సాండర్ గిల్లె (బెల్జియం) జంటను ఓడించింది. బాంబ్రీ జోడీ నేడు ప్రిక్వార్టర్స్ ఆడనుంది.

కివీస్ సారథిగా బ్రాస్‌వెల్



వెల్లింగ్టన్: స్వదేశంలో పాకిస్థాన్‌తో జరుగబోయే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు గాను న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ మైఖెల్ బ్రాస్‌వెల్ ఆ జట్టుకు సారథిగా వ్యవహరించనున్నాడు. కివీస్ స్టార్ ప్లేయర్లు, ఆ జట్టు నాయకుడు మిచెల్ శాంట్నర్‌తో పాటు గ్లెన్ ఫిలిప్స్, డెవాన్ కాన్వే, లాకీ ఫెర్గూసన్, రచిన్ రవీంద్ర, బెవాన్ జాకబ్స్ ఐపీఎల్-18కు తమ ఫ్రాంచైజీలకు ఆడనున్న నేపథ్యంలో బ్రాస్‌వెల్ కివీస్‌ను నడిపించనున్నాడు. న్యూజిలాండ్, పాకిస్థాన్ మధ్య ఈనెల 16 నుంచి 26 దాకా ఐదు టీ20లు జరుగనున్నాయి. పాక్ జట్టు యువ బ్యాటర్ సల్మాన్ అలీ అఘా నేతృత్వంలో బరిలోకి దిగనుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.